అవ్వలకు రేషన్ కష్టాలు

- ఏడాది కాలంగా అందని రేషన్ బియ్యం
- ఇబ్బంది పడుతున్న వృద్ధురాలు

భీమ్‌గల్: ప్రజాపంపిణీ వ్యవస్థలో అక్రమాలను అరికట్టేందుకు తీసుకొచ్చిన కొత్త టెక్నాలజీతో వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ కార్డులకు ఆధార్ లింకు చేసి మొబైల్ నంబరుకు వచ్చే ఓటీపీ ద్వారా బియ్యం పంపిణీ చేసేలా కొన్ని నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయమే కొందరు వృద్ధుల పాలిట శాపంగా మారింది. ఐరిస్, వేలి ముద్రలు పడకపోవడంతో రేషన్ బియ్యానికి దూరం అవుతున్నారు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడంతో వృద్ధులు ఆకలితో అలమటిస్తున్నారు. ఐరిస్, వేలి ముద్రలు రాని వారికి మొబైల్ నంబర్, ఆధార్‌తో అనుసంధానం ఉన్న వాటికి ఓటీపీతో రేషన్ సరుకులు అందజేస్తున్నారు. అయితే చాలా మంది పేదలకు ఆధార్‌తో మొబైల్ నంబర్ అనుసంధానం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేక..

ఆధార్, ఓటీపీ ఏర్పాటుకు ముందు కూడా ఐరిస్, వేలి ముద్రల కారణంగా వృద్ధులు ఇబ్బందులు పడ్డ సమయంలో థర్డ్ పార్టీ ఐడెంటిఫికేషన్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. అప్పట్లో వీఆర్‌వో వేలి ముద్ర ద్వారా అథెంటికేషన్ చేసి అలాంటి వారికి రేషన్ బియ్యం సరఫరా చేశారు. తరువాతి కాలంలో వీఆర్‌వో వ్యవస్థను తొలగించడంతో ఈ ఏర్పాటుకు ఆటంకం ఏర్పడింది. వయసు పైబడిపోవడమే మేము చేసుకున్న పాపమా అని చాలా మంది వృద్ధులు చాలా బాధా పడుతున్నారు. ఇలాంటి వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వేడుకుంటున్నారు.



ఈ ఫోటోలో ఉన్న వృద్ధురాలు భీమ్‌గల్ మండలం బాబాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి. ఈమెకు గతంలో అంత్యోదయ కార్డు ద్వారా 35 కిలోల రేషన్ బియ్యం వస్తుండె. కానీ దాదాపు ఒకటిన్న ఏడాది నుంచి వేలి ముద్రలు, ఐరిస్ లేని కారణంగా రేషన్ బియ్యం ఇస్తలేరు. ఈమె ఎప్పుడు రేషన్ షాపుకి వెళ్లినా నీ ఆధార్‌కు ఫోన్ నంబర్ లింక్ లేదు. నీవు ఆధార్‌కు ఫోన్ నంబర్ లింక్ చేస్తే, నీ ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తది. అప్పుడు ఇక్కడ రేషన్ ఇస్తాం అని చెప్పేవారు. దాంతో ఆ వృద్ధురాలు ఆధార్ కార్డ్‌కు ఫోన్ నంబర్ లింక్ చేయించుకోవడానికి ఆధార్ సెంటర్‌కి వెళ్తే అక్కడ ఈ వృద్ధురాలి వేలి ముద్రలు, ఐరిస్ రాకపోవడంతో ఆధార్ సెంటర్ వాళ్లు ఫోన్ నంబర్ లింక్ చెయ్యలేదు. ఇలా పలు మార్లు జరిగిన తరువాత... ఆమె అధికారుల చుట్టూ తిరిగి పలుమార్లు దరఖాస్తు చేసుకుంది. ఎన్నిసార్లు విన్నవించుకున్న అధికారులు ఆమెకు పరిష్కారం చూపలేకపోయారు. ఈ సమస్య ఒక్క కుంట బాగుదే కాదు చాలా మంది వృద్ధులకు ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి.

ఇప్పించేలా చర్యలు తీసుకోండి

దాదాపు సంవత్సర కాలం నుంచి బియ్యం ఇస్త లేరు. అధికారుల దగ్గరికి చాలా సార్లు వెళ్లాను. ఎవరూ నా బాధను పట్టించుకోవడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరైనా నా బాధను అర్థం చేసుకొని బియ్యం ఇప్పించండి.

– కుంట బాగు, బాబాపూర్

క్లుప్తంగా

చెక్కుల పంపిణీ



బాల్కొండ: ముప్కాల్ మండల పరిధిలో పలు గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం ఎంపీపీ సామ పద్మ, జెడ్పీటీసీ బద్దం నర్సవ్వ, వైస్ ఎంపీపీ ఆకుల చిన్నరాజన్న చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, కో–ఆప్షన్ సభ్యుడు మునిరొద్దీన్, తహసీల్దార్ విక్రమ్, ఎంపీటీసీ నేత పద్మ పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు..



పెర్కిట్(ఆర్మూర్): అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకుని ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ యూనియన్ బ్యాంక్ మహిళ రుణ గ్రహీతలకు గురువారం కుట్టు మిషన్లను అందజేశారు. బ్యాంక్ రీజనల్ మేనేజర్ నరేంద్ర కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ సాధికారత కోసం బ్యాంకు అందజేస్తున్న సహకారంలో భాగంగా కుట్టు మిషన్లను అందజేసినట్లు తెలిపారు. బ్యాంకు మేనేజర్ అనిల్ పాల్గొన్నారు.

నందిపేట ఉపాధ్యాయురాలికి స్త్రీశక్తి జాతీయ అవార్డు



నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు సీహెచ్ వరలక్ష్మి మహిళా శిరోమణి స్త్రీశక్తి అవార్డును అందుకున్నారు. హైదారాబాద్ తెలంగాణ సారస్వత పరిషత్‌లో సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన మహిళలకు పురస్కారాలు అందజేశారు. వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించినందుకు ఈ అవార్డును అందజేశారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



మాక్లూర్: వెంకటాపూర్, రాంపూర్ గ్రామాల్లో గురువారం జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు హైమాస్ లైట్లను ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నుంచి జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు నిధులు ఇవ్వటంతో రెండు గ్రామాలకు చెందిన గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు హైమాస్ట్ బల్బులను కొనుగోలు చేసి గ్రామంలోని విద్యుత్ స్తంభాలకు అమర్చి జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు చేతుల మీదుగా ప్రారంభించారు.

'శనగ'పై నిబంధనలు ఎత్తివేయాలి



రుద్రూర్: కొనుగోలు కేంద్రాల్లో ఆరు క్వింటాళ్ల శనగ మాత్రమే తీసుకుంటామనే నిబంధన తొలగించాలని శనగ రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కోటగిరి రైతు వేదికలో గురువారం మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రామ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆరు క్వింటాళ్ల శనగ కొనుగోలు కేంద్రంలో విక్రయించి మిగిలిన పంట ఉత్పత్తిని మార్కెట్‌లోకి తరలించాల్సి వస్తోందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో స్లన్‌ఫ్లవర్ కూడా తీసుకోవాలని కోరారు.

దగ్ధమైన గుడిసె పరిశీలన

ఎడపల్లి(బోధన్): ధర్మారం గ్రామంలో రెండు రోజుల కిందట పద్మకు చెందిన పూరిగుడిసె దగ్ధమైంది. గురువారం గ్రామ పంచాయతీ కార్యదర్శి పద్మావతి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు.

క్యాంపస్ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించండి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌లోని బాలుర, బాలికల హాస్టల్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం తెయూ పరిపాలనా భవనం వద్ద వారు మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

మహిళా సాధికారతకు చట్టాలు అవసరం



కోటగిరిలో మహిళలను సన్మానిస్తున్న ఎంఈవో

రుద్రూర్: మహిళలు అన్ని రంగాల్లో రాణించినపుడే దేశాభివృద్ధి జరుగుతుందని, మహిళా సాధికారికతకు గట్టి చట్టాలు అవసరమని మండల విద్యాధికారి నాగనాథ్ అన్నారు. కోటగిరి మండల విద్యావనరుల కేంద్రంలో గురువారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. రకరకాల ఆటలు నిర్వహించి బహుమతులు అందచేశారు. మహిళ ఉపాధ్యాయులను సన్మానించారు.

అక్బర్‌నగర్‌లో కబడ్డీ పోటీలు

రుద్రూర్ మండలంలోని అక్బర్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో మహిళ దినోత్సవం నిర్వహించారు. కబడ్డీ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తిగుళ్ల గంగామణి, పాఠశాల టీచర్లు, అంగన్ వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పద్మశాలి సంక్షేమ సేవ సమితి ఆధ్వర్యంలో

ఆర్మూర్‌టౌన్: పట్టణ పద్మశాలి సంఘంలో పద్మశాలి సంక్షేమ సేవా సమితి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవాలందించిన పద్మశాలి మహిళలను ఘనంగా సత్కారించారు.



ఆర్మూర్‌లో పద్మశాలి సేవ సమితి ఆధ్వర్యంలో మహిళలకు సన్మానం



హసాకొత్తూర్‌లో సన్మానిస్తున్న సర్పంచ్

హసాకొత్తూర్ జీపీ ఆధ్వర్యంలో..

కమ్మర్‌పల్లి:హసాకొత్తూర్‌లో గురువారం జీపీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులను సన్మానించారు. పారిశుధ్య కార్మికులు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, మహిళా సంఘాల వీవోలు, సీఏలను సర్పంచ్ ఏనుగు పద్మ శాలువాలతో సన్మానించారు. ఉప సర్పంచ్ రాజేశ్వర్, కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అత్యున్నత రంగాల్లో మగువలు రాణించాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ పద్మాశరత్ రెడ్డి

బోధన్‌టౌన్(బోధన్): అత్యున్నత రంగాలలో మగువలు రాణించాల్సిన అవసరముందని మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని బుధవారం పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీ సావిత్రి దేవి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని, మహిళ ఒక రోజులో ఎంత శ్రమిస్తుందో అంతే ధ్యానం చేసి ఆరోగ్యాన్ని కుటుంబాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. అనంతరం మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో ధ్యాన కేంద్ర ప్రతినిధులు రజిత వాణి, శ్రీనివాస్, కమల కుమారి, అప్పల నాయుడు, చంద్రకళ రమేష్, తదితరులు పాల్గొన్నారు.



బోధన్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి

మహిళలు వంటింటికే పరిమితం కారాదు

ఆర్మూర్‌టౌన్ : మహిళలు వంటింటికే పరిమితం కారాదని, అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత అన్నారు. సమాజంలో స్త్రీ పాత్ర చాలా గొప్పదన్నారు. గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రెండో రోజు మున్సిపల్ కార్యాలయంలో ఆటల పోటీలు నిర్వహించారు. ఆర్పీలకు, సిబ్బందికి మ్యూజికల్ చైర్, స్పూన్ పోటీలు నిర్వహించారు. మెప్మా సిబ్బంది ఉదయ్‌శ్రీ, ఆర్పీలు పాల్గొన్నారు.



ఆర్మూర్ పట్టణంలో మ్యూజికల్ చైర్ ఆడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్, ఇతర మహిళలు

కంటి సమస్యలను నయం చేసుకోవాలి



బాగేపల్లిలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్



ఉప్లూర్‌లో పరీక్ష చేయించుకుంటున్న సర్పంచ్

రెంజల్(బోధన్): ప్రతి ఒక్కరు కంటి జబ్బులను నయం చేసుకోవాలని బాగేపల్లి సర్పంచ్ పాముల సాయిలు కోరారు. గ్రామంలో గురువారం కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. డాక్టర్ వినయ్‌కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారులు కరిపే రవీందర్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

వేల్పూర్: కోమన్‌పల్లిలో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి అశోక్, స్థానిక సర్పంచ్ పత్రి మంజుల ప్రారంభించారు. వేల్పూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి శరత్‌చంద్ర, బీఆర్ఎస్ నేత పత్రి రాజేశ్వర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

కమ్మర్‌పల్లి: ఉప్లూర్‌లో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ బద్దం పద్మ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అనిల్‌రెడ్డి, ఉప సర్పంచ్ నందగిరి రేఖ, నాయకులు చిన్నారెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

'13 నుంచి సమ్మె చేస్తున్నాం'

ఆర్మూర్‌టౌన్: ఈనెల 13 నుంచి సమ్మె చేస్తున్నట్లు ఎండీఎం కార్మికులు ప్రకటించారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆర్మూర్ తహసీల్దార్ వేణుగోపాల్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఎండీఎం మండల కార్యదర్శి జక్కం సుజాత మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెంచిన వేతనాలు వెంటనే అమలు చేయాలన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు



బాల్కొండ: బాలలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని మెండోరా ఎంపీపీ సుకన్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ కమిటీ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలల పరిరక్షణ కమిటీ ప్రాధాన్యత గురించి వివరించారు. బాలల హక్కులను కాపాడాలన్నారు. బాలల అక్రమ రవాణా జరగకుండా చూడాలన్నారు. సీడీపీవో భార్గవి, ఎంపీడీవో శ్రీనివాస్, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల గుర్తింపు రద్దు చేయండి



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న శ్రీ చైతన్య ప్రైమరీ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని పాఠశాల ఎదుట పీడీఎస్‌యూ నాయకులు ధర్నా చేపట్టారు. పీడీఎస్ యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్, ఎస్ఎఫ్ఐ నేత నాగరాజు మాట్లాడుతూ.. అనుమతులు లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశా రు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సమయపాలన లేకుండా గంటల కొద్ది చదివిస్తూ ఒత్తిడి కి గురిచేస్తున్నారని ఆరోపించారు. పాఠశాల ఎదుట ఎంఈవో కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు.

ప్రత్యేక జిల్లా.. ప్రజల ఆకాంక్ష



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు కావాలని ఈ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష అని న్యాయవాదులు అన్నారు. అధికార పక్ష ప్రజాప్రతినిధులు ప్రజల ఆకాంక్షను గుర్తించాలని పేర్కొన్నారు. ప్రత్యేక జిల్లా ప్రకటించాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 81వ రోజుకు చేరాయి. దీక్షలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గంగారెడ్డి, పలువురు న్యాయవాద గుమస్తాలు కూర్చున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రుద్రూర్: అభివృద్ధి పనులు నాణ్యతగా చేపట్టాలని మోస్రా ఎంపీపీ పిట్ల ఉమాశ్రీరాములు సూచించారు. మోస్రా మండలం చింతకుంట గ్రామంలో ఉపాధి హామీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఆమె ప్రారంభించారు. సర్పంచ్ విమల లింగయ్య, ఉప సర్పంచ్ నాగుల స్వామి, సింగిల్ విండో చైర్మన్ గంగారెడ్డి, నేతలు హన్మంత్ రెడ్డి, సాయగౌడ్, ఇస్మాయిల్ ఉన్నారు.

సంక్షిప్తం

గోసంగిలు రాజకీయంగా ఎదగాలి

నవీపేట: గోసంగి కులస్తులు రాజకీయంగా ఎదుగు దల సాధించాలని గోసంగి సంఘం జిల్లా అధ్యక్షు లు గంధం రాజేష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన మండల కమిటీ సమావేశంలో క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంధం రాజేష్ మాట్లాడారు. ఆర్థికంగా వెనుకబడిన గోసంగిలను అన్ని రాజకీయ పార్టీలు అణగదొక్కుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గోసంగిలను గుర్తించిన పార్టీలకే రాబోయే ఎన్నికల్లో మద్దతు ప్రకటిస్తామని పేర్కొన్నారు.

పేదింటి బిడ్డ పెళ్లికి చేయూత

రెంజల్(బోధన్): పేదింటి బిడ్డ పెళ్లికి సాటాపూర్ సర్పంచ్ ఎఖార్‌పాష చేదోడుగా నిలిచారు. తనవంతుగా పెళ్లి ఖర్చుల కోసం రూ.5 వేల నగదును అందించి సహకరించారు. సాటాపూర్ గ్రామానికి చెందిన పల్లపు శంకర్, యాదమ్మ దంపతుల కుమార్తె అనితకు గురువారం గ్రామంలో పెళ్లి జరిపిస్తున్నారు. వారి పరిస్థితి తెలుసుకున్న సర్పంచ్ నగదును అందించారు.

బాధిత కుటుంబానికి సాయం

రుద్రూర్: కోటగిరి మండలం యాద్‌గార్‌పూర్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సయ్యద్ కుటుంబాన్ని గురువారం రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ కన్వీనర్, డీసీసీ డెలిగేట్ యలమంచిలి శ్రీనివాస్ రావ్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందచేశారు.

అటెన్షన్ ప్లీజ్..

వృథాగా పోతున్న తాగు నీరు



అలీసాగర్ నుంచి నిజామాబాద్ నగరానికి వచ్చే ఫిల్టర్ వాటర్ పైపులైన్ ఎయిర్‌వాల్వ్ నుంచి భారీగా మంచినీరు వృథాగా పోతోంది. ఆరు నెలల నుంచి నీరు పోతున్నా అధికారులు స్పందించకపోవడం శోచనీయం. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఎయిర్‌వాల్వ్ లీకేజీలకు మరమ్మతులు చేసి, నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– ఎడపల్లి(బోధన్)

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: శంకర్, ఏఈ, మున్సిపల్ కార్పొరేషన్

ఫోన్ నంబర్ : 78159 57057

ప్రణాళికతో అభివృద్ధి చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ పస్క నర్సయ్య

పెర్కిట్(ఆర్మూర్): గ్రామాలను ప్రభుత్వం నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేసుకోవాలని ఆర్మూర్ ఎంపీపీ పస్క నర్సయ్య సూచించారు. ఆర్మూర్ ఎంపీడీవో కార్యాలయంలో గురువారం రెండో విడత స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జీపీ కార్యదర్శులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, మహిళా సంఘాలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ పస్క నర్సయ్య ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్‌బీఎం స్టేట్ లెవెల్ మాస్టర్ ట్రైనర్స్ సూచించిన విధంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సంతోష్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఎంసీ గంగారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో సురేశ్, ఎస్‌బీఎం కో–ఆర్డినేటర్లు రాజు, నరేష్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తైబజార్ వేలం రూ.21.20 లక్షలు



వేలం నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మున్సిపల్ పరిధిలోని తైబజార్ వేలం 2023–24 సంవత్సరానికి రూ.21 20 లక్షలకు పలికింది. గురువారం మున్సిపల్ కార్యాలయంలో తైబజార్ వేలం పాటను మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ నిర్వహించారు. ఈ వేలంలో టెండర్‌దారులు 27 మంది పాల్గొన్నారు. అందులో రూ.21.20 లక్షల అత్యధిక వేలాన్ని పలికి అజర్ అహ్మద్ తైబజార్‌ను దక్కించుకున్నాడు. గత యేడాది తైబజార్ రూ. 21.51 లక్షలకు పలికింది.

పశువధశాలకు రూ.7.90 లక్షలు

మున్సిపల్ కార్యాలయంలో పశువధశాల వేలం 2023–24 సంవత్సరానికి రూ.7.90 లక్షలు పలికింది. వేలంలో 18 మంది పాల్గొనగా అహ్మద్ ఖురేషి దక్కించుకున్నారు. గతేడాది పశువధశాల రూ. 2.70 లక్షలు పలకగా ఈ ఏడాది రూ. 5.20 లక్షలు ఎక్కువగా వచ్చాయి.

'అధికార పార్టీ నేతలకు కొమ్ముకాస్తున్నారు'



ముప్కాల్‌లో మాట్లాడుతున్న ఎంపీటీసీ పద్మ

బాల్కొండ: ముప్కాల్‌లో పోలీసులు అధికార పార్టీ నాయకులకు కొమ్ము కాస్తున్నారని ముప్కాల్ ఎంపీటీసీ పద్మ ఆరోపించారు. గురువారం ఆమె తన నివాసంలో మాట్లాడారు. సాక్ష్యాధారాలు ఉన్నా అధికార పార్టీ నాయకులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కనుసన్నల్లోనే ముప్కాల్ బీఆర్ఎస్ నాయకులు రెచ్చిపోతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ తన అనుచరులతో కలిసి దాడులు చేస్తున్నా పోలీసులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఆర్మూర్ రూరల్ సీఐకి ఎన్ని సార్లు ఫోను చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కోర్టు ఉత్తర్వులను కూడా పోలీసులు ధిక్కరిస్తున్నారన్నారని, ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. బీజేపీ నాయకుడు సంతోష్ తదితరులు ఉన్నారు.

రవన్న ఆశయాలను కొనసాగిద్దాం



రెంజల్/నందిపేట/ఆర్మూర్/బోధన్/కమ్మర్‌పల్లి : కామ్రేడ్ రవన్న 7వ వర్ధంతిని సీపీఐఎం ప్రజాపంథా, రైతు కూలీ సంఘాల ఆధ్వర్యంలో రెంజల్, నందిపేట, ఆర్మూర్, బోధన్, కమ్మర్‌పల్లి మండలాల్లో గురవారం నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రవన్న అమర్ రహే అంటూ నినానాదాలు. ఆయన ఆశయాలను కొనసాగించాలని నేతలు నినదించారు.

సమాచారం..

■ దరఖాస్తులకు ఆహ్వానం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ బోధించటానికి అర్హులైన అభ్యర్థులు అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వేణుగోపాలస్వామి తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 13లోపు దరఖాస్తులు చేసుకోవాలని, సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు.

■ 17న రుద్రూర్ మండల పరిషత్ సమావేశం

రుద్రూర్: రుద్రూర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 17న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బాల గంగాధర్ తెలిపారు. తొలుత 10న సభ జరపాలని నిర్ణయించినప్పటికీ అనివార్య కారణాల వల్ల 17వ తేదీకి మార్చినట్లు వెల్లడించారు. రైతు వేదిక భవనంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ సుజాత అధ్యక్షతన సభ ఉంటుందని తెలిపారు.

■ 13న చందూర్‌లో సమావేశం

చందూర్ మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 13న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నీలావతి తెలిపారు. ఎంపీపీ లావణ్యారాంరెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు.

■ నేడు స్పీకర్ పోచారం రాక

రుద్రూర్: సులేమాన్‌నగర్‌కు శుక్రవారం అసెంబ్లీ స్పీకర్ శ్రీనివాస్ రెడ్డి వస్తున్నట్లు సర్పంచ్ ఖాదర్ తెలిపారు. జీపీ, ఆరోగ్య ఉప కేంద్రం, సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తారని వివరించారు.